క్లుప్తంగా

వైభవంగా మహాలక్ష్మీ హోమం



మహానందిలో హోమం నిర్వహిస్తున్న పండితులు

మహానంది: స్థానిక ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా పంచమి తిథితో కలిసి వచ్చిన మొదటి శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని, నాగేశ్వరశర్మ, ఆంజనేయశర్మ, హనుమంతశర్మ.. మహాలక్ష్మి హోమాన్ని వైభవంగా నిర్వహించారు. మహానందీశ్వర స్వామి వారికి అభిషేకం, కామేశ్వరీదేవి అమ్మవారికి పూలంగి సేవ చేపట్టారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

కోదండ రాముడికి వెండి దీపాలు విరాళం



ఈఓకు వెండి దీపాలు అందిస్తున్న శేఖర్ దంపతులు

మహానంది: మహానంది ఆలయంలో కొలువైన కోదండరాముల వారికి మహానంది గ్రామానికి చెందిన భవనాశి ఎల్లయ్య, సుధామణి కుటుంబ సభ్యులు, మిత్రుల సహకారంతో చేయించిన వెండి దీపాలను శుక్రవారం బహుకరించారు. స్థానిక సమాచార కేంద్రానికి చేరుకుని 871.200 గ్రాముల రెండు వెండి దీపాలను ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డికి భవనాశి ఎల్లయ్య, శేఖర్ దంపతులు అందించారు. కార్యక్రమంలో ఏఈఓ మధు, అర్చకుడు మణికంఠ శర్మ, ఇన్‌స్పెక్టర్ శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

డ్రైవర్ల పాత్ర కీలకం



ఆదర్శ ఉద్యోగులకు నగదు బహుమతి అందజేస్తున్న ఆర్టీసీ డీఎం నాగేశ్వరరావు

నందికొట్కూరు: ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడంలో ఆర్టీసీ డ్రైవర్ల పాత్ర కీలకమని డిపో మేనేజర్ నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ డిపోలో ఆదర్శ ఉద్యోగులకు అభినందన సభ నిర్వహించారు. ఆదర్శంగా నిలిచిన ఆర్టీసీ ఉద్యోగులను నగదు బహుమతి అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెరుగైన సేవలందించిన డ్రైవర్లు కేజేసీ రెడ్డి, ఎం శేఖర్, కే.మద్దిలేటి, కండెక్టర్లు డీఏ రజాక్, బీ జయన్న, డీఏ సలాంను మిగగా ఉద్యోగులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

సన్మానం



ఎంపీడీఓ సరస్వతిని సత్కరిస్తున్న సిబ్బంది

పాములపాడు: స్థానిక ఎంపీడీఓ సరస్వతి సత్యసాయి జిల్లా పరిగి మండలానికి బదిలీపై వెళ్తున్న సందర్భంగా శుక్రవారం ఉద్యోగులు, సిబ్బంది ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఆమె మాట్లాడుతూ ఎన్నికల బదిలీల్లో భాగంగా 6 నెలల పాటు విధులు నిర్వహించానన్నారు. మండల ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో ఎలాంటి సమస్యల్లేకుండా పని చేయగలిగానన్నారు. సహకరించిన ప్రతిఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పగిడ్యాల: విద్యుత్ సరఫరాలో శనివారం అంతరాయ ఉంటుందని మండల విద్యుత్ ఏఈ క్రాంతికుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతుండటంతో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. వ్యవసాయానికి ఉదయం 5 గంటల నుంచి సరఫరా ఉంటుందని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

శిక్షణ తరగతులకు హాజరుకండి

పాములపాడు: పంచాయతీ రాజ్ సంస్థల ప్రజాప్రతినిధులకు, అధికారులకు వార్షిక ప్రణాళిక 2024–25 ప్రకారం నిర్వహించే శిక్షణ తరగతులకు హాజరుకావాలని ఎంపీడీఓ సరస్వతి తెలిపారు. శుక్రవారం ఆమె తన కార్యాలయంలో మాట్లాడుతూ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు 3 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు.

● జూపాడుబంగ్లా: ఈనెల 12 నుంచి మూడు రోజులపాటు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నూర్జహాన్ తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ 2024–25 ఏడాది కాలానికి గాను ఆర్.జీ.ఎస్.ఏ కార్యాచరణ ప్రణాళికలు, శానిటేషన్, సాలిడ్‌వేస్ట్‌మేనేజ్‌మెంట్ యూనిట్ల నిర్వహణ, జీపీడీపీ స్క్రూటినీ తదితర వాటిపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

జగనన్నకు ఘన స్వాగతం

- సీతారామపురంలో సుబ్బరాయుడి కుటుంబాన్ని ఓదార్చిన జననేత
- మాజీ సీఎంను చూసేందుకు జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన అభిమానులు



అన్నొచ్చాడు: అయ్యలూరు మిట్ట వద్ద వైఎస్ జగన్‌తో కరచాలనానికి ఎగబడుతున్న అభిమానులు

మహానంది: మండలంలోని సీతారామపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత పసుపులేటి సుబ్బరాయుడు హత్యకు గురైన నేపథ్యంలో అతని కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు వచ్చిన మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అభిమానులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఓర్వకల్లు ఎయిర్ పోర్టు నుంచి రోడ్డు మార్గం ద్వారా గ్రామానికి వచ్చిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నాయకులు, అభిమానులు, ప్రజలు అడుగడుగునా స్వాతం పలికారు. సీతారామపురం గ్రామానికి వస్తున్న నేపథ్యంలో నంద్యాల, కర్నూల్లోని నలుమూలల నుంచి భారీగా తరలి వచ్చారు. హత్యకు గురైన సుబ్బరాయుడు ఇంటి వద్దకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేరుకోగానే ఒక్కసారిగా ఆ ప్రాంగణమంతా అభిమానులతో నిండిపోయింది. సుబ్బరాయుడు భార్య బాలసుబ్బమ్మ, కుమారులు ప్రసాదు, జమాలయ్య, నాగప్రసాదు, కోడళ్లు సునిత, కుమారితో పాటు టీడీపీ నాయకుల దాడిలో గాయ పడిన బుడ్డారెడ్డి గారి లక్ష్మీదేవి కుటుంబ సభ్యులతో జగన్మోహన్‌రెడ్డి మాట్లాడారు. కాగా గాజులపల్లె రైల్వేస్టేషన్ గ్రామానికి చెందిన జవ్వాజి దాసు ఈ ఏడాది జూన్ 26న అనుమానాదాస్పద స్థితిలో మృతిచెందడంతో అతని కుమారుడు దినేష్, కుటుంబ సభ్యులు మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి టీడీపీ నేతలే హత్యకు పాల్పడ్డారని మాజీ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. తమకు న్యాయం చేయాలని కోరారు. మహానంది జెడ్పీటీసీ మహేశ్వరరెడ్డి, కన్వీనర్ పాల మహేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ బూతు కమిటీల కన్వీనర్ కుంచపు శ్రీనివాసులు, గాజులపల్లె కొండా మధుసూదన్‌రెడ్డి, వీరారెడ్డి, చలమారెడ్డి, బండిఆత్మకూరు మాజీ ఎంపీపీ బేశు వెంకటరామిరెడ్డి, ఉప సర్పంచు అవుటాల నాగేశ్వరరెడ్డి, ముంతల మధుశేఖర్, సింగిల్ విండో మాజీ చైర్మన్ ప్రసాద రెడ్డి, చిన్న సుబ్బారెడ్డి, పార్టీ యూత్ విభాగం మండల అధ్యక్షుడు దీప్‌కాంతరెడ్డి, మద్దిలేటిరెడ్డి, అవుటాల చిన్నసుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. కాగా ఎస్పీ ఆదిరాజ్‌సింగ్ రాణా ఆధ్వర్యంలో ఎస్పీ, డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు, రోప్ పార్టీ బృందాలు బందోబస్తు నిర్వహించారు.



యువోత్సాహం: బలపనూరు వద్ద జగన్‌ను చూసిన ఆనందంలో కార్యకర్తల కేరింతలు



ఆత్మీయ పలకరింపు: సీతారామపురంలో మహిళలను పలకరిస్తున్న వైఎస్ జగన్



అదిగదిగో జగన్: బలపనూరు వద్ద వైఎస్ జగన్‌కు స్వాగతం పలికేందుకు సిద్ధంగా ఉన్న అభిమానులు



అభిమానం ఎదురొచ్చి: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం తెలుపుతున్న యువకులు



బలపనూరు వద్ద వైఎస్ జగన్‌కు స్వాగతం పలుకుతున్న కార్యకర్తలు, అభిమానులు



మిద్దెలెక్కిన అభిమానం: సీతారామపురంలో జగనన్నను చూసేందుకు మిద్దెలెక్కిన జనం

ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం



జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఏపీఓ సురేష్

శ్రీశైలంప్రాజెక్ట్: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని శుక్రవారం ఎస్టీ పాఠశాల ఆవరణంలో శ్రీశైలం ఐటీడీఏ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఓ ఎ.సురేష్‌కుమార్ మాట్లాడుతూ ఆదివాసీలు సామాజికంగా, ఆర్థికంగా ఎదిగేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెడుతున్నాయన్నరు. వారి జీవనస్థితిగతుల మార్పునకు ఐటీడీఏ కృషి చేస్తోందన్నారు. సద్వినియోగం చేసుకోవాలని గిరిజనులకు సూచించారు. జ్యూట్ బ్యాగ్‌ల తయారీకి వినియోగించే ముడిపదార్థాలను, జీవనోపాధుల పెంపునకు అవసరమైన కిరాణా సామగ్రిని, అటవీ భూహక్కు చట్టం ప్రకారం 25 మందికి 44.99 ఎకరాల భూమి పట్టాలను గిరిజనులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధికారులు టి.లత, బి.సి.ధనుంజయ, కె.జి.నాయక్, స్టేట్ లెవల్ గవర్నింగ్ బాడీ సభ్యులు కుడుముల మూగెన్న, దాసరి అంకన్న, విలేజ్ రెన్యువల్ ఆర్గనైజేషన్ ప్రతినిధి డాక్టర్ ఇ.నరసింహారెడ్డి, రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ రీజినల్ డైరెక్టర్ నాగరాజు, గిరిజన సంఘాల ప్రతినిధులు చెవుల అంజయ్య, నిమ్మల ఈదన్న, భూమని వెంటేశం, భూమని వెంకటయ్య, భూమని మంతన్న, రావుల కొండలు, ఎం.బయన్న, టీడీపీ నాయకులు కల్లం రామాంజిరెడ్డి, నందికొండ సుబ్బారావు, నంద్యాల, పల్నాడు, ప్రకాశం జిల్లాలకు చెందిన గిరిజనులు పాల్గొన్నారు.

ఆదివాసీల అస్తిత్వాన్ని కాపాడుకుందాం

వెలుగోడు: ఆదివాసుల అస్తిత్వాన్ని కాపాడుకుందామని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వై నరసింహులు అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినం సందర్భంగా అఖిల భారత రైతుకూలీ సంఘం (ఏఐకేఎంఎస్) ఆధ్వర్యంలో వెలుగోడు చెంచు కాలనీలో ఘనంగా నిర్వహించారు. సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి ఎం గోపాల్, మండల నాయకులు లాలు నాయక్, కృష్ణ, చెంచులు భూదేవి, భూమన గొలుసన్న, ఈరమ్మ, తోట ఈదన్న, లింగమ్మ, అంకన్న తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం జోలికొస్తే సహించేదిలేదు





పబ్బతి శివప్రసాద్ స్వాములు

నందికొట్కూరు: అంబేడ్కర్ విగ్రహం తొలగించేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర పన్నితే సహించేదిలేదని పబ్బతి మాలమహానాడు తాలుకా అధ్యక్షులు శివప్రసాద్, ఎమ్మార్పీఎస్ నాయకుడు స్వాములు హెచ్చరించారు. శుక్రవారం వారు వేర్వేరుగా మాట్లాడారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం వద్ద విగ్రహ శిలా ఫలకం ధ్వంసం చేయడం సిగ్గు చేటన్నారు. అంబేడ్కర్ విగ్రహంపై దాడి చేయడమంటే రాజ్యాంగంపై దాడి చేయడమేనన్నారు. అంబేడ్కర్ కుల, మతాలకు అతీతుడన్నారు. ప్రపంచంలోని పలు దేశాల్లో అంబేడ్కర్ విగ్రహాలను ఏర్పాటు చేసి గౌరవిస్తుండగా మన దేశంలో అవమానించడం తగదన్నారు. విజయవాడ నడిబొడ్డున అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయడాన్ని ఓర్వలేక దాడుల చేస్తే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. మరోసారి అంబేడ్కర్ విగ్రహం జోలికి వస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలకు దిగుతామన్నారు.

బాధ్యతల స్వీకరణ



ఖాజామొద్దీన్ హెడ్‌పోస్ట్‌మాస్టర్



సాయికృష్ణగౌడ్ పోస్ట్‌మాస్టర్



ఆల్‌ఫ్రెడ్ తహసీల్దార్

నందికొట్కూరు: స్థానిక బజార్ పోస్టాఫీసు పోస్ట్ మాస్టర్ ఖాజామొద్దీన్‌ను హెడ్ పోస్టాఫీసుకు బదిలీ చేయడంతో ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ పట్టణవాసులకు తపాలా శాఖ ఆధ్వర్యంలో మెరుగైన సేవలు అందిస్తానన్నారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్న తన దృష్టికి తీసుకురావాలన్నారు. కాగా జిల్లా కేంద్రంలోని హెడ్ పోస్టాఫీస్‌లో పోస్టల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న సాయి కృష్ణగౌడ్ నందికొట్కూరు బజార్ పోస్ట్ మాస్టర్‌గా నియమించడంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

బండిఆత్మకూరు తహసీల్దార్..

మహానంది: బండిఆత్మకూరు నూతన తహసీల్దార్‌గా ఆల్‌ఫ్రెడ్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. డిప్యూటీ తహసీల్దార్ హరిత, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది ఆయనకు పుష్ప గుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

కార్పొరేట్ శక్తులకు బీజేపీ ప్రభుత్వం తొత్తు



నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

పాములపాడు: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు తొత్తుగా వ్యవహరిస్తోందని కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు స్వామన్న, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు బాలయ్య ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం రైతు, కార్మిక, వ్యవసాయ కూలీల వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక బస్టాండ్ సెంటరులో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నల్ల చట్టాలను తెచ్చి రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అసంఘటిత కార్మికులకు జీతాలు పెంచాలని, వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేయాలని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు నారాయణ, బాలయేసు, రమణ, జయరాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు

జూపాడుబంగ్లా: స్థానిక పోలీసుస్టేషన్‌కు సమీపంలో శుక్రవారం కేజీ రోడ్డుపై ఆటో– కారు ఢీకొన్న ఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడినట్లు ఎస్‌ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. ఆత్మకూరు నుంచి కర్నూలుకు వెళ్తున్న కారు, నందికొట్కూరు నుంచి జూపాడుబంగ్లాకు వస్తున్న ఆటో మార్గమధ్యలో జూపాడుబంగ్లా పోసుస్టేషన్‌కు సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో ఆటో డ్రైవర్ ఎరుకలి సవారి, చాకలి అరవింద్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. కారు డ్రైవర్ అనిల్ గాయపడ్డారు. వీరి ని చికిత్స నిమిత్తం నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎస్‌ఐ లక్ష్మీనారాయణ, కానిస్టేబుల్ సునీల్ ఘటనా ప్రాంతానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్లియర్‌చేసి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్‌ను కారు ఢీకొన్న ఘటనలో..

మిడుతూరు: ముందు వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి కారు ఢీకొట్టడంతో చెరుకుచెర్ల గ్రామానికి చెందిన కురువ పుల్లయ్య, చాకలి పెద్ద బాలన్న గాయాలపాలయ్యారు. పుల్లయ్య, బాలన్న ద్విచక్రవాహనంపై నందికొట్కూరు నుంచి చెరుకుచెర్ల గ్రామానికి వెళ్తుండగా బాట ఆంజనేయ స్వామి సమీపంలో ప్రమాదం చోటుచేసుకుంది. క్షతగాత్రులను కర్నూలు ఆసుపత్రికి తరలించారు.

వక్ఫ్ ఆస్తుల చట్ట సవరణ రాజ్యాంగ విరుద్ధం

నందికొట్కూరు: వక్ఫ్ ఆస్తుల చట్ట సవరణ రాజ్యాంగ విరుద్ధమని ఆవాజ్ కమిటీ రాష్ట్ర నాయకులు అబుబక్కర్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ సవరణ చేసి ముస్లింలకు ద్రోహం చేయాలనుకోవడం తగదన్నారు. వక్ఫ్ చట్ట సవరణ బిల్లును ముస్లింలు వ్యతిరేకిస్తున్నా ఎన్డీఏ ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ముస్లింల విలువైన ఆస్తులను కాజేయాలనే ఉద్దేశంతోనే కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ చట్ట సవరణకు పూనుకుంటోందన్నారు. వక్ఫ్ చట్ట సవరణ బిల్లుకు టీడీపీ మద్దతు ఇవ్వడంతో ముస్లింలపై ఆ పార్టీ వైఖరి తేటతెల్లమైందన్నారు. సవరణ బిల్లు విరమించుకోకపోతే ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు.

బాలిక అదృశ్యం

మిడుతూరు: మండల పరిధిలోని తలముడిపి గ్రామానికి చెందిన ఓ బాలిక అదృశ్యమైనట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ జగన్‌మోహన్ తెలిపిన వివరాలు.. తలముడిపి గ్రామానికి చెందిన బాలిక ఈనె 8 రాత్రి తినుబండారాలు తీసుకొస్తానని కుటుంబ సభ్యులకు చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. తల్లిదండ్రులు తెలిసిన చోటల్లా వెతికినా ఆచూకీ లభించకపోవడంతో శుక్రవారం పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

18న సర్వసభ్య సమావేశం

పాములపాడు: వైద్య, ఆరోగ్య ఉద్యోగుల సమస్యలపై చర్చించేందుకు ఈనెల 18న సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు వైద్య, ఆరోగ్య సమన్వయ కమిటీ సభ్యులు చంద్రశేఖర్, మద్దిలేటి తెలిపారు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీలో వారు మాట్లాడారు. కర్నూలు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాల లెక్చరర్ గ్యాలరీలో సమావేశం ఉంటుందన్నారు. వైద్య ఆరోగ్య శాఖలోని అన్ని క్యాడర్ల ఉద్యోగులు హాజరు కావాలన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలు విరమించుకోండి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

నందికొట్కూరు: ప్రజావ్యతిరేక విధానాలు విరమించుకోవాలని సీపీఐ రైతు సంఘం జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణకు వినతి పత్రం అందజేశారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని మాట తప్పిందన్నారు. విత్తనాలు, పురుగు మందులను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడం దుర్మార్గమైన చర్య అన్నారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం నాయకులు శ్రీనివాసులు, నాగన్న, డాక్టర్ చంద్రశేఖర్, రైతు సంఘం నాయకులు నాగరాజు, శేఖర్, సుధాకర్, స్వామన్న, మౌలాలి, నాగశేషులు పాల్గొన్నారు.

పంటల నమోదు తప్పనిసరి



తరిగోపుల సమీపంలోని మొక్కజొన్న పంటను నమోదు చేస్తున్న ఏఈ కృష్ణారెడ్డి

జూపాడుబంగ్లా: సాగుచేసిన పంటలను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి కృష్ణారెడ్డి రైతులకు సూచించారు. శుక్రవారం తరిగోపుల గ్రామ పరిధిలో సాగు అయిన పంటలను నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ పంటలను నమోదు చేయించుకోవడం వల్ల పలు లాభాలున్నాయన్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో పరిహారం అందుతుందని, ధర లేనప్పుడు ప్రభుత్వం ప్రకటించే గిట్టుబాటు ధరకు అర్హులవుతారని తెలిపారు. అనంతరం గ్రామానికి చెందిన రైతు భాస్కర్ సాగుచేసిన మొక్కజొన్న పొలంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఆయన వెంట వీఏఏ బాబు, ఎంపీఈఓ చిన్నవీరమ్మ పాల్గొన్నారు.

కొలనుభారతి దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు



చిన్నారులకు అక్షరాభ్యాసాలు నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: మండలంలోని నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన పవిత్ర పుణ్యక్షేత్రమైన కొలనుభారతి దేవి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం నాగపంచమి, గరుడ పంచమి సందర్భంగా అమ్మవారు భక్తులకు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ పురోహితులు అమ్మవారికి భక్తులచే కుంకుమార్చన, పుష్పార్చన, మంగళ హారతి వంటి విశేష పూజా కార్యక్రమాలు నిర్వమించారు. అక్కడే ఉన్న సప్తశివాలయాల్లోని దేవతామూర్తులకు భక్తులు భక్తితో పూజలు చేశారు. అనంతరం ఆయల పురోహితుల ఆధ్వర్యంలో 24 మంది చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు.

పాఠశాలల తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈఓ సుభాన్

పగిడ్యాల: మండలంలోని లక్ష్మాపురం ప్రాథమికోన్నత పాఠశాలలు(ఉర్దూ, తెలుగు మీడియం), అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంఈఓ సుభాన్ శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం పిల్లలకు అందించాలని వంట నిర్వాహకులకు సూచించారు. మెనూ పాటించకపోతే త్రీ మెన్ కమిటీ ద్వారా ఏజెన్సీని తొలగిస్తామని హెచ్చరించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని పిల్లలకు నాణ్యమైన విద్యాబోధనను అందించాలని ఆదేశించారు.

విద్యార్థికి డెంగీ

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంట ఎస్టీ గురుకుల పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థికి డెంగీ జ్వరం సోకినట్లు డాక్టర్.బి.మహేశ్వరరెడ్డి శుక్రవారం తెలిపారు. ఈనెల 5న చలి జ్వరంతో బాధపడుతున్న విద్యార్థికి సున్నిపెంట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రక్త పరీక్షలు నిర్వహించగా డెంగీ జ్వరంగా నిర్ధారణ అయ్యిందన్నారు. ఆరోగ్యశ్రీ కార్డులో విద్యార్థి పేరు నమోదు కానందున, ఆరోగ్యమిత్ర రవికుమార్ ముఖ్యమంత్రి క్యాంప్ ఆఫీస్‌ను సంప్రదించి ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్సలు చేయించారు.

వీబీఆర్‌కు కొనసాగుతున్న నీటి విడుదల

వెలుగోడు: వీబీఆర్‌కు నీటి విడుదల కొనసాగుతోంది. శ్రీశైల జలాశయం వెనకతట్టు జలాలను తెలుగు గంగ కాల్వ ద్వారా విడుదల చేస్తుండటంతో వీబీఆర్ సామర్థ్యం 16.95 టీఎంసీలకు గానూ శుక్రవారం సాయంత్రానికి 16.32 టీఎంసీలకు చేరింది. బానకచర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి వీబీఆర్‌కు 12,500 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. వీబీఆర్ నుంచి 9,100 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయంలో సమృద్ధిగా నీటి నిల్వలు ఉండటంతో ఆయకట్టు కింద రైతులు విస్తారంగా వరి సాగు చేస్తున్నారు. అలాగే వెలుగోడు, ఆత్మకూరు, నంద్యాల ప్రాంతాల ప్రజలకు కూడా తాగునీటి ఎద్దడి తీరనుంది. కాగా జలాశయాన్ని వీక్షించేందుకు వివిధ ప్రాంతాల నుంచి తరలి వస్తున్న సందర్శకులతో వెలుగోడు రిజర్వాయర్ వద్ద సందడి నెలకొంది.

కోలుకోలేక వ్యక్తి మృతి

మిడుతూరు: రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నంద్యాల మండలం చాపిరేవుల గ్రామానికి చెందిన నాగార్జున (49) కోలుకోలేక శుక్రవారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. ఈ నెల 6న శుభకార్యానికి హాజరయ్యేందుకు నాగార్జున ద్విచక్రవాహనంపై ప్రాతకోట గ్రామానికి వచ్చినాడు. కార్యక్రమం ముగించుకుని స్వగ్రామానికి బయలుదేరాడు. మిడుతూరు మండలం జలకనూరు బాట వద్ద అదుపుతప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108లో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక మృతిచెందినట్లు ఏఎస్‌ఐ సుబ్బయ్య తెలిపారు. మృతుడికి భార్య రమణమ్మ, నలుగురు కూతుళ్లు ఉన్నారు. మృతుడి సోదరుడు నాగశేషయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలి

కొత్తపల్లి: పాఠశాల నిర్వహణ కమిటీ ఎన్నికలు జరపకుండా ఏకపక్షంగా వ్యవహరించిన చిన్నగుమ్మడాపురం గ్రామ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రామకృష్ణయ్యపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు రాజు, కృష్ణుడు, సంసోను, దైవజ్ఞానం, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభాకర్, రాజులు శుక్రవారం ప్రకటనలో కోరారు. కోరం ఉన్నా ఎన్నికలను వాయిదా వేయడం ఎమిటని ప్రశ్నించారు. విద్యార్థుల తల్లిదండ్రులలో ఒక బుక్‌కీపర్, ప్రకృతి వ్యవసాయ శాఖలో పనిచేసే వ్యక్తులు ఉన్నారని వారికి ఓటు వేసే హక్కులేదని వేరే వ్యక్తులకు ఏకపక్షంగా వ్యవరించడం ఏమిటని ఆవేదన వ్యక్తపరిచారు.

నివాళి

ఆత్మకూరు: స్థానిక 4వ వార్డు కౌన్సిలర్ సుగుణమ్మ భర్త సుందర్‌రావు శుక్రవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యు లు ఎం.ఎ.రషీద్, మున్సిపల్ కౌన్సిలర్లు ముర్తుజా, షఫీవుల్లా, రంగస్వామి, ప్రకాష్, నాయకులు మోమిన్, మునీర్‌బాషా తదితరులు సుందర్‌రావు మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఘనంగా సినీ హీరో మహేష్‌బాబు జన్మదినం

వెలుగోడు: సినీ హీరో సూపర్ స్టార్ మహేష్‌బాబు పుట్టినరోజు వేడుకలు పట్టణంలో ఘనంగా నిర్వ హించారు. మహేష్‌బాబు పుట్టినరోజు సందర్భంగా ఆయన అభిమానులు శుక్రవారం ఎంపీపీ ఉర్దూ, ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో 100 మంది విద్యార్థులకు ఎగ్జామ్స్ ప్యాడ్స్, పెన్నులు పంపిణీ చేశారు. మహేష్ బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ వెలుగోడు ప్రెసిడెంట్ దర్వేష్ ఖాద్రి, సెక్రటరీ అష్రఫ్ అలీ, నాయకులు సమద్, ఇర్ఫాన్, నూరుల్లా, అఫ్సర్, అబ్దుల్ కరీం, సద్దాం, హకీమ్ తదితరులు పాల్గొన్నారు.

సేవల్లో యువత ముందుండాలి

ఆత్మకూరు: సమాజ సేవా కార్యక్రమాల్లో యువత ముందుండాలని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి సూచించారు. ఇటీవల తాడిపత్రిలో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండోలో పాల్గొని ప్రతిభ కనబరిచిన ఆత్మకూరు విద్యార్థులకు ఆయన శుక్రవారం మెడల్స్, సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తైక్వాండో శిక్షణ ఆత్మ రక్షణకు ఉపయోగపడుతుందన్నారు. యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత శ్రీశైలం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి పస్పిల్ మున్నా, మోమిన్, హుసేన్ సాహెబ్, అజుమన్, స్పోర్ట్స్ క్లబ్ సహాయ కార్యదర్శి ఆసీఫ్‌బేగ్, తైక్వాండో శిక్షకులు ఖాజా, స్వామన్న, ముర్తుజావలి పాల్గొన్నారు.